క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కాకినాడ రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10.30కు జరుగుతుందని ఎంపీడీఓ పి.సతీష్ తెలిపారు. ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో 2025–26కు సంబంధించి 15వ ఆర్థిక సంఘ నిధులు, సాధారణ నిధుల నుంచి మంజూరు చేసిన పనులకు ఆమోదం, ఉపాధి హామీ పనులకు ఆమోదంతో పాటు, ఇతర అంశాల తీర్మానాలకు ప్రతిపాదనలు చేస్తున్నారని, వాటిపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

నూకాలమ్మకు రూ.12 లక్షల చెవిదుద్దుల సమర్పణ


నూకాలమ్మకు బంగారు చెవిదుద్దులు సమర్పిస్తున్న దాత

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ సూర్యారావుపేటలోని నూకాలమ్మ అమ్మవారికి నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మానేపల్లి సత్యనారాయణ 123 గ్రాముల బంగారంతో చేయించిన రూ.12 లక్షల విలువైన చెవిదుద్దులు సమర్పించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చేతుల మీదుగా ఆదివారం ఈఓ ఉండవల్లి వీర్రాజుకు వీటిని దాత అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ కార్యదర్శి తలాటం నాని పాల్గొన్నారు.

ఘనంగా ఆచార్య ప్రబోధానంద జయంతి


తిమ్మాపురంలో గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఆర్ఎంఎ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ఆదికర్త, శతాధిక గ్రంథ కర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, రావు రవిబాబు, సలాది రమేష్, సుంకర సత్య సాయిబాబు, ఆర్ఎంఎ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటరమణ, బచ్చు సూర్యనారాయణ, డాక్టర్ సూర్యలక్ష్మి తదితరులు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లుకు నివాళులర్పించారు. ఆయన రచించిన గ్రంథాలను ఆవిష్కరించారు.

వీధి నామ ఫలకం ఆవిష్కరణ


నామ ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యవతి

బోట్‌క్లబ్: నగరంలోని 41వ డివిజన్‌లో మల్లయ్య అగ్రహారం రామాలయం ఎదురుగా ఉన్న వీధికి రామాలయం వీధిగా నామకరణం చేసి, శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం నామ ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ వీధికి రామాలయం వీధి పేరున ఏర్పాటు చేసేందుకు 2022లో కార్పొరేషన్ కౌన్సిల్ తీర్మానం చేసినట్టు మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తుల రామకృష్ణ, కంచి సుబ్బారావు, టేకుమూడి శ్రీనివాస్, గుండాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూలిన చెట్ల తొలగింపు


రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో రోడ్డుపై కూలిన చెట్టు

కాకినాడ రూరల్: అకాల వర్షం కారణంగా శనివారం సాయంత్రం కూలిపోయిన చెట్ల తొలగింపు పనులను అధికారులు చేపట్టారు. గాలుల తీవ్రతకు చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో శనివారం పలు గ్రామాలలో అంధకారం నెలకొంది. రమణయ్యపేట, వాకలపూడి, వలసపాలక తదితర గ్రామాలలో విద్యుత్ తీగలపై పడిన చెట్లను విద్యుత్ సిబ్బంది ఆదివారం తొలగించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

సామర్లకోట: వాహనాలను మద్యం తాగి నడిపితే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అన్నారు. మద్యం మత్తులో ఉన్న వాహన చోదకులు అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని, ఇటువంటి సమయంలో అమాయకులు ప్రాణాలను కోల్పోతున్నారన్నారు.


సీతారామస్వామి ఆలయంలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు


సూర్యారావుపేటలోని రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కాకినాడ రమణయ్యపేటలో సీతారాముల కల్యాణోత్సవం


రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పానకం పంపిణీ


కరప నీలయ్యతోటవీధి రామాలయంలో కల్యాణం అనంతరం సీతారాములు

కల్యాణం.. కడురమణీయం..

- వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు
- గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి


మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు


రిజర్వ్‌లైన్ కోదండ రామస్వామి ఆలయంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్ దంపతులు

బోట్‌క్లబ్: సీతారాముని కల్యాణ వేడుకలు చూసేందుకు ఆదివారం భక్తులకు రెండు కనులు చాలలేదు. శ్రీరామ నవమి వేడుకలు నగరంలో కడురమణీయంగా నిర్వహించారు. పలు సీతారామస్వామి ఆలయాలతో పాటు, పలు దేవస్థానాల్లో కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి దేవస్థానంలో నవమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. పండితులు వాడపల్లి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. శుభముహూర్తాన తాళి కట్టడం, తలంబ్రాలు వంటి ఘట్టాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈఓ ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తలంబ్రాలు పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు పానకం, పులిహోర ప్రసాదంగా అందజేశారు. స్థానిక అశోక్‌నగర్‌లో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, జానకీరమ దంపతుల ఆధ్వర్యంలో నవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక టూటౌన్ వద్ద నున్న కోదండ రామస్వామి ఆలయంలో జరిగిన కల్యాణ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక రామారావుపేట శివాలయంలో ప్రాంగణంలో రామాలయంలోను, గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముని ఆలయంలోను కల్యాణ వేడుకలు నిర్వహించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న రామాలయంలో కన్నుల పండువగా కల్యాణం జరిగింది. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పైడా రామకృష్ణారావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. స్థానిక భానుగుడి సెంటర్‌లోని రిజర్వ్ పోలీస్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామివారికి జిల్లా ఎస్పీ బిందుమాధవ్ పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక విద్యుత్‌నగర్ వినాయకుని ఆలయంలో సీతారామ కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక పేర్రాజుపేటలో కె.రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం కనుల వైకుంఠంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్వీ సాయిబాబా పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గ్రామగ్రామాన నవమి వేడుకలు

కాకినాడ రూరల్: శ్రీరామ నవమి వేడుకలు కాకినాడ రూరల్‌లో ఘనంగా జరిగాయి. గ్రామగ్రామాన ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రామాలయాలు, హనుమాన్ మందిరాల వద్ద సీతారాముల కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. రాములోరి కల్యాణం తిలకించేందుకు ఆలయాల వద్దకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించడంతో భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఆలయాల వద్ద శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా దర్శనాలు, అనంతరం తీర్థ ప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు.

గ్రామాల్లో కన్నుల పండువగా కల్యాణాలు

కరప: మండలంలోని అనేక గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక నీలయ్యతోట వీధి రామాలయంలో లకమన సురేష్, వెంకటలక్ష్మి దంపతులు, పల్లపువీధిలో పుణ్యమంతుల సూర్యనారాయణమూర్తి దంపతులు, కొత్తపేటవీధిలో డేగల రత్నబాబు, లక్ష్మి దంపతులు, మార్కెట్ సెంటర్ పెంకేవారివీధి రామాలయంలో పెంకే మంగరాజు దంపతులు, సిరిపురంలో చిక్కాల అబ్బు, మంగ దంపతులతో వేద పండితులు కల్యాణ వేడుకలు నిర్వహించారు. జెడ్.భావారం, కొరిపల్లి, పెనుగుదురు, వాకాడ, కరప, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, వేములవాడ, వేళంగి, సిరిపురం, యండమూరు, గొర్రిపూడి, విజయరాయుడుపాలెం, పాతర్లగడ్డ, జీ.భావారం, కూరాడ, నడకుదురు, గురజనాపల్లి, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. కరపలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, నక్కా సత్తిబాబు, అడబాల ప్రసాద్, సాదే లోహిదాస్‌కుమార్, చిన్నారి మురళీకృష్ణ, చింతా ఈశ్వరరావు, రొక్కాల గణేష్ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై ముస్లింల నిరసన



వాకలపూడిలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

కాకినాడ రూరల్: కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు కాకినాడ రూరల్‌కు చెందిన ముస్లింలు స్పష్టం చేశారు. వాకలపూడిలో రూరల్ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు కరీం బాషా ఆధ్వర్యంలో ఆదివారం కేజీఎస్ వల్లి నివాసంలో ముస్లింలు సమావేశమయ్యారు. తొలుత హిందువులకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వక్ఫ్ సవరణ చట్టంపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఇస్మాయిల్, హాజీ ఎండీ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వసంత నవరాత్ర పూజలు నేటితో ముగింపు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రారంభమైన వసంత నవరాత్ర ఉత్సవాలు సోమవారంతో ముగుస్తాయి. దీనిలో భాగంగా ఆదివారం ఈఓ బళ్ల నీలకంఠం పర్యవేక్షణలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి నవవరణార్చన త్రిశతి ఖడ్గమాల, లలితా అష్టోత్తర సహస్రనామాలు, కుంకుమార్చనలు, నీరాజన మంత్ర పుష్పాల కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ పండితులు అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, వేమూరి చంటి, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వెండి ఆభరణాలతో అలంకరించగా, అమ్మవారికి బంగారు కిరీటం, ఆభరణాలతో అలంకరణ చేశారు.

అనస్థీషియాతో ఉన్నత భవిష్యత్తు

- ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్
- మత్తు వైద్యంలో కొత్త రీతులపై జోనల్ సీఎంఈ


సీఎంఈలో మాట్లాడుతున్న డాక్టర్ అర్చన. చిత్రంలో డాక్టర్ విష్ణువర్ధన్ తదితరులు

కాకినాడ క్రైం: మత్తు వైద్య రంగంలో కొత్త రీతులతో అనస్థీషియా వైద్యుల భవిష్యత్తు ఆశాజనకంగా ఉందని, ప్రజారోగ్యానికి ఇదో వరమని రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ అన్నారు. ఆదివారం డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో అనస్థీషియా పీజీల కోసం జోన్–2 సీఎంఈ(కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్) నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూరుకు చెందిన కువై మెడికల్ సెంటర్ అనస్థీషియా అసోసియేట్ ప్రొఫెసర్, అకాడమీ ఆఫ్ రీజినల్ అనస్థీషియా జాయింట్ సెక్రటరీ డాక్టర్ అర్చన అరేటి ఈ సీఎంఈకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ, శస్త్రచికిత్సకు మూలాధారమైన అనస్థీషియాకు ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. తద్వారా అనస్థీషియాతో అత్యున్నత భవిత సాకారమవుతుందని తెలిపారు. ఇది మత్తు వైద్యుల భవిష్యత్తుకు శుభపరిణామమన్నారు. వృద్ధి చెందుతున్న జ్ఞానాన్ని, సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా రోగికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. మత్తు వైద్య ప్రక్రియలను డాక్టర్ అర్చన దృశ్యరూపంలో వివరించారు. ఐసీయూ, అనస్థీషియాలో అల్ట్రాసౌండ్ పాత్ర అనే అంశంపై విశ్లేషణాత్మక వివరణ ఇచ్చారు. అంతకుముందు స్కిల్ ల్యాబ్‌లో నర్వ్ బ్లాక్స్ సొనాటమీ, పాయింట్ ఆఫ్ కేర్ ఆఫ్ అల్ట్రా సౌండ్‌పై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ వింధ్య బ్రెయిన్ డెత్‌ను విశ్లేషించారు. దేహదానంలో అనస్థీషియాలజిస్టుల పాత్రను వివరించారు. ఐసోలేటెడ్ లిమ్ పెర్ఫ్యూజన్స్ అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అచ్యుతరామయ్య మాట్లాడుతూ, ప్రత్యేక శస్త్రచికిత్స విధానాలకు అనుకూలమైన మత్తు వైద్య మెళకువలకు ఎదురయ్యే సవాళ్లను వివరించారు. జీఎస్ఎల్ వైద్య కళాశాల అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణప్రసాద్ అల్ట్రాసౌండ్ ట్రంకల్ బ్లాక్స్ అంశాన్ని వివరించారు. సదస్సు ముగింపులో భాగంగా డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ కాకినాడ జీజీహెచ్‌లో రోజులో 24 గంటల విధానంలో న్యూరోసర్జరీ ఓటీ, ట్రామా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. పలు కార్యశాలలు నిర్వహించి 14,696 మేజర్ సర్జరీలు, 35,875 మైనర్ సర్జరీలు నిర్వహించామన్నారు. ఈ సీఎంఈకి ఉమ్మడి తూర్పుగోదావరికి చెందిన మత్తు వైద్య పీజీలతో సహా వివిధ ప్రాంతాలకు చెందిన అనస్థీషియా వైద్యులు హాజరయ్యారు. సదస్సు అనంతరం పలువురు వైద్యులకు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ అర్చన సర్టిఫికెట్లు అందజేశారు.

కాసులు ఇంపు.. నగరం కంపు..

- ఆస్తి, నీటి పన్ను వసూళ్లలో అత్యుత్సాహం
- పారిశుధ్య నిర్వహణలో పూర్తిగా వైఫల్యం
- రోగాలు ప్రబలుతున్నా పట్టించుకోని నగరపాలక యంత్రాంగం
- బకాయి వసూళ్ల కోసం ఎలాంటి చర్యలకైనా సిద్ధం!
- కార్పొరేషన్ తీరుపై 'స్మార్ట్ సిటీ' ప్రజల మండిపాటు


రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో డ్రైనేజీ దుస్థితి ఇలా..

బోట్‌క్లబ్: దాదాపు దశాబ్ద కాలం క్రితం కేంద్రం స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు ఎంపికైన పారిశ్రామిక నగరం కాకినాడ.. ప్రస్తుతం కనీస పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో కంపు కొడుతోంది. మౌలిక సౌకర్యాలతో, సామాజిక, ఆర్థిక, పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే స్మార్ట్ సిటీ ఉద్దేశం. బృహత్తర కార్యాచరణతో ప్రవేశపెట్టిన ఈ మిషన్‌లో కీలకమైనది పారిశుధ్య నిర్వహణ. నగరం నుంచి వెలువడే చెత్తను ఇతర అవసరాలకు మళ్లించడమే కాకుండా, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ.. ఆర్థికంగా నగరాన్ని బలోపేతం చేయడమే దీని ముఖ్యోద్దేశం. దాదాపు పదేళ్ల క్రితం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం అంతా సజావుగా జరిగి ఉంటే.. ఈపాటికి కాకినాడ నగరం ఊహకందని రీతిలో అభివృద్ధి జరిగి ఉండాలి. కానీ.. ప్రస్తుత పరిస్థితిని పరికిస్తే.. నగరంలో రోడ్లు, డ్రైనేజీలను అధ్వానంగా మారాయి. కుప్పలు తెప్పలుగా ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. పారిశుధ్య నిర్వహణకు నిధుల్లేక.. చెత్త తరలించే వాహనాలనూ మూలన పడేశారు. ఇవేమీ తమకు పట్టనట్టు నగరపాలక యంత్రాంగం వ్యవహరిస్తూ.. ఆస్తి పనులు, నీటి పన్నులంటూ నగర పౌరుల ముక్కుపిండి బకాయిలు వసూలు చేయడంలో నిమగ్నమైంది. పదేళ్లలో స్మార్ట్ సిటీ సాధించిన ప్రగతి ఇదేనా అంటూ నగర ప్రజలు చర్చించుకుంటున్నారు.

పేరుకుపోయిన చెత్త

నెలల తరబడి నగరంలోని అనేక ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. అవుట్ లెట్ మేజర్ డ్రైన్ నిర్వహణ పూర్తిగా గాడి తప్పింది. పారిశుధ్య నిర్వహణ ఎక్కడా కానరావడం లేదు. మేజర్ కాలువలు ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్ల వ్యర్థాలతో నిండిపోయాయి. నెలలు తరబడి డ్రైనేజీల్లో పూడికలు తీయకపోవడంతో, జనావాసాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడద ఇక చెప్పనలవి కాదు. కొన్నిచోట్ల డ్రైనేజీల నుంచి పురుగులు గృహాల్లోకి చొరబడుతున్నాయంటే పరిస్థితి ఏ మేరకు దిగజారిందో అవగతమవుతోంది. నగరంలోని సంజయ్‌నగర్, దుమ్ములపేట, బ్యాంక్‌పేట, రామకృష్ణారావుపేట మెయిన్ రోడ్, చీడీలపోర, ప్రభుత్వాస్పత్రి, అచ్యుతాపురం రైల్వే గేట్, రేచర్లపేట రైల్వే డ్రైన్లో పూడికలు పేరుకుపోయాయి. వీటిలో మురుగు నీరు పారడం లేదు. పారిశుధ్య సిబ్బంది అసలు వీటి జోలికే వెళ్లడం లేదు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ ఇంత అధ్వానంగా ఉన్నా, దీనివల్ల రోగాలు ప్రబలుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. కాకినాడ నగర పాలసంస్థకు పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

పాలకవర్గం లేక..

నగరపాలక సంస్థకు పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ప్రజలు విమర్శిస్తున్నారు. పాలకవర్గం ఉంటే.. ఆయా డివిజన్లలో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే ఆస్కారం ఉండేదంటున్నారు. కౌన్సిల్ సమావేశాల్లో ప్రజల సమస్యలు చర్చించి, ఆయా సమస్యలు పరిష్కారానికి నోచుకునేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, నగరంలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా క్షీణించిందని నగర ప్రజలు పెదవి విరుస్తున్నారు.

పన్ను వసూళ్లపైనే శ్రద్ధ!

కార్పొరేషన్ అధికారులకు ఆస్తి పన్నులపై ఉన్న శ్రద్ధ పారిశుధ్య నిర్వహణలో చూపడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇంటి పన్ను కట్టకపోతే మున్సిపల్ మంచినీటి కుళాయిలకు సీలు వేసి.. ముక్కుపిండి మరీ పన్నులు కట్టించుకుంటున్నారు. ప్రజా సమస్యలను మాత్రం అధికారులు పెడచెవిన పెడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నివాస ప్రాంతాల్లో మాత్రం నిత్యం పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నారు. నిత్యం బ్లీచింగ్, ఫినాయిల్ వంటివి చల్లుతున్నారు. సాధారణ జనావాసాలు అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సిబ్బంది పట్టించుకోవడం లేదు



మా వీధిలో డ్రైనేజీ శుభ్రం చేసి సుమారు నెల రోజులు కావస్తోంది. డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు నీరు పారడం లేదు. పారిశుధ్య సిబ్బంది రోడ్డును శుభ్రం చేసి వెళుతున్నారు మినహా, డ్రైనేజీలో చెత్తాచెదారం తీయడం లేదు. డ్రైనేజీలో చెత్తను తీయమంటే, తాము చాలా వీధులు శుభ్రం చేయాలని, ఖాళీ లేదని సమాధానం చెబుతున్నారు.

– ఈదర సుబ్బారావు, విద్యుత్‌నగర్

తీవ్రంగా దోమల బెడద



డ్రైనేజీలు అధ్వానంగా ఉండడంతో దోమలు ఉధృతి ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో దోమల బెడద తీవ్రంగా ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కార్పొరేషన్ అధికారులు కనీసం దోమల నియంత్రణకైనా చర్యలు తీసుకోవాలి.

– కె.పద్మజ, రేచర్లపేట

కరెంట్ స్తంభాలపై వైరు చోరీ


సామర్లకోట-పిఠాపురం రోడ్డులో విద్యుత్ స్తంభాలకు కట్ చేసిన వైర్లు

సామర్లకోట: పిఠాపురం రోడ్డులో ఉప్పువారి సత్రం సమీపంలో విద్యుత్ స్తంభాలకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఏర్పాటు చేసిన వైర్లను శనివారం రాత్రి దొంగలు అపహరించారు. సుమారు 20 స్తంభాలపై ఉన్న 5 లైన్ ఎల్టీ కండక్టరు వైరు ఎక్కడికక్కడే ముక్కలు చేసి తస్కరించినట్టు అధికారులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


పార్టీ జెండా ఎగురవేస్తున్న బిక్కిన

బోట్‌క్లబ్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పార్టీ జెండా ఆవిష్కరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.